క్లుప్తంగా

టీషర్టుల పంపిణీ



క్రీడాకారులకు టీషర్టులను అందజేస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: స్థానిక ఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో సోమవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి సరఫరా అయిన టీషర్టులను మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున క్రీడాకారులకు అందజేశారు. క్రీడాకారుల్లోని నైపుణ్యాలను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్రీడా సంబరాలు నిర్వహిస్తోందని తెలిపారు. క్రీడాకారులు ప్రతిభను చాటి జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్‌ఓ నాసిర్, ఏఈ హరికృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తక్షణసాయం అందజేత

గుత్తి: పట్టణంలోని కురుబ వీధికి చెందిన వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ సుధాకర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. వైఎస్సార్ బీమా పథకం తక్షణసాయం కింద సోమవారం రూ.10 వేల తక్షణసాయాన్ని మృతుడి భార్యకు అందజేశారు. మిగతా డబ్బు త్వరలోనే బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగి వెంకటేష్, వైఎస్సార్‌సీపీ 15వ వార్డు ఇన్‌చార్జ్‌లు హమాలి రామాంజి, చంద్ర, సునీల్, ప్రసాద్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ అందజేత



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అశోక్

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట వలంటీర్ అశోక్ హైదరాబాద్ వెళ్లి ఓ వృద్ధురాలికి పింఛన్ అందజేశాడు. వివరాలిలా ఉన్నాయి. కొత్తపేట గ్రామానికి చెందిన వి.అమ్మని అనే వృద్ధురాలు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మోకాళ్ల నొప్పులకు శస్త్ర చికిత్స చేయించుకుని అక్కడే బంధువుల ఇంట్లో ఉండిపోయింది. విషయం తెలుసుకున్న వలంటీర్ అశోక్ తన సొంత ఖర్చుతో సోమవారం హైదరాబాద్ వెళ్లాడు. వృద్ధురాలు అమ్మనితో వేలిముద్ర తీసుకుని పింఛన్ అందజేశాడు. వలంటీర్ సేవలను వైస్ ఎంపీపీ తిరుపాలమ్మ, సర్పంచ్ గురుమస్తాన్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు రాముయాదవ్ అభినందించారు.

చేనేత వృత్తిపై అవగాహన అవసరం



ఇండస్ట్రియల్ విజిట్‌కు బయలుదేరుతున్న విద్యార్థులు

గార్లదిన్నె: ఒకేషనల్ విద్యార్థులు చేనేత వృత్తిపై అవగాహన కలిగి ఉండాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సతీష్ పేర్కొన్నారు. సోమవారం మోడల్ స్కూల్లో అమలవుతున్న ఒకేషనల్ కోర్సు అప్పెరల్ అండ్ మేడ్ అప్స్‌లో భాగంగా ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మర్తాడులో మగ్గాలను విద్యార్థులు పరిశీలించారు. మగ్గాల నిర్వాహణ, చేనేత వృత్తిపై ఉపాధ్యాయలుడు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఒకేషనల్ టీచర్ నరసింహ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోండి



రైతులతో కలిసి మామిడి తోటను సందర్శిస్తున్న అధికారులు

గుత్తి రూరల్: రైతులు భూసార పరీక్షలు, నీటిపరీక్షల ఆధారంగా మామిడి తోటలను సాగు చేయాలని జిల్లా ఏడీహెచ్ నరశింహారావు, ఏరువాక శాస్త్రవేత్త రామసుబ్బయ్య సూచించారు. సోమవారం మండలంలోని ఊబిచెర్ల గ్రామంలో కరిడికొండ, ఊబిచెర్ల గ్రామ రైతులకు మామిడి తోటల సాగుపై ఉద్యానశాఖ-ఏపీఐఐఏటీపీ సంయుక్తంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు మొక్కలను ఎన్నుకోవడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఐర్నియర్ గ్రాఫ్టింగ్ పద్ధతిలో అంటు కట్టిన మొక్కలను ఎన్నుకోవాలన్నారు. గుంతలను మూడు అడుగుల లోతు తీయాలన్నారు. 100 కిలోల పశువుల ఎరువు, వర్మీకంపోస్టు, వేపచెక్క వంటి యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. మొగ్గ, పూత దశ, పచ్చి పూత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నెలసరి వారిగా రైతులు పాటించాల్సిన విషయాలను తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఓ మిత్రవింత మాధవి, ఏఓ ముస్తాక్ అహ్మద్, అగ్రిబోర్డు అడ్వైజరీ బోర్డు చైర్మన్ రామరంగారెడ్డి, వీఏఏ అజయ్, ఉప సర్పంచ్ ఆనందరావు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు

ముందస్తు సంక్రాంతి సంబరాలు

పెద్దవడుగూరు/పుట్లూరు: పెద్దవడుగూరు మండల పరిధిలోని లక్ష్ముంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. రంగు రంగుల ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. అంతకుముందు పాఠశాల ఆవరణలో భోగి మంటలు వేశారు. ప్రతి విద్యార్థికీ ఏదో ఒక రంగంలో ప్రతిభ ఉంటుంది. వారిలో నైపుణ్యాలను వెలికితీసేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించామని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. అలాగే పుట్లూరు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, రాయలసీమ పాఠశాలల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో విద్యార్థినులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భోగి సంక్రాంతి పండుగ విశిష్టతను ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం విద్యార్థినులకు బహుమతులు అందజేశారు.



పుట్లూరు ఆదర్శ పాఠశాల ఆవరణలో భోగి మంటలు వేసిన దృశ్యం



పెద్దవడుగూరు: విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న దృశ్యం



పుట్లూరు: ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయిలు



పుట్లూరు ఆదర్శ పాఠశాలలో రంగవల్లుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

ఓటర్ల జాబితా సవరణపై అపోహలు వద్దు

- తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి



గుంతకల్లు రూరల్: ఓటర్ల జాబితా సవరణపై ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఓటర్ల జాబితాలో ఉన్న డబుల్ ఎంట్రీ ఓట్లు, డెత్ ఓట్స్, పర్మినెంట్ మైగ్రేషన్ ఓటర్లను పూర్తిస్థాయిలో పరిశీలించడం జరిగిందన్నారు. వాటి వివరాలను ఇప్పటికే ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల కమిషన్ ముందుగా చెప్పినట్లు సవరించిన ఓటర్ల జాబితాను జనవరి 5వ తేదీన ప్రచురించాల్సి ఉందని తెలిపారు. అయితే ఆ తేదీని జనవరి 22వ తేదీకి పొడిగించడం జరిగిందన్నారు. ఈ విషయం తెలియక జనవరి 5వ తేదీ దాటినా ఓటర్ల జాబితాలో ఓట్ల తొలగింపు జరగలేదని కొన్ని పత్రికల్లో ప్రచురించడం జరిగిందన్నారు. ఓ వైపు ఓటర్లు మరోవైపు రాజకీయ పార్టీల నాయకులు కూడా ఆందోళనకు గురయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. పూర్తిస్థాయిలో సవరించిన ఓటర్ల జాబితాను ఎన్నికల కమిషన్ జనవరి 22న ప్రచురించడం జరుగుతుందని వెల్లడించారు. ఓటుహక్కు నమోదు, మార్పులు చేర్పులు, తొలగింపు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. జనవరి 22న ప్రచురించే ఓటర్ల జాబితాలో ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా కూడా దరఖాస్తు చేసుకుని సరిదిద్దుకోవచ్చని తెలిపారు.

రేపటి నుంచి మండలస్థాయి క్రీడలు

యల్లనూరు: ఈనెల 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వీరరాజు, ఎంఈఓలు చంద్రోశేఖర్, పరమేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పీఈటీ, పీడీలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సచివాలయం, పంచాయతీ స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈనెల 10వ తేదీ నుంచి మండల స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. జెడ్పీ హైస్కూల్ యల్లనూరు క్రీడా ప్రాంగణంలో పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పీడీ ప్రసాద్ నాయక్, బాల మధుసుదన్ రెడ్డి, శ్రీనివాసరావు, విజయకుమారి, పీఈటీ ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: మంగళవారం నుంచి ఈనెల 18 వరకూ మండలస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ రవి తెలిపారు. గ్రామస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారాలు మండల స్థాయి క్రీడల్లో పాల్గొంటారని ఎంఈఓ నాగరాజు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని సీబీ రోడ్ ప్రధాన రహదారిలో క్రీడా పోటీలపై అవగాహన కల్పించేందుకు వివిధ పాఠశాలల విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రంగరావు, ఆయా పాఠశాలల పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.



తాడిపత్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి



గుంతకల్లులో రిలే దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

గుంతకల్లు: నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి కే.ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో గుంతకల్లు డివిజన్ వ్యాప్తంగా రిలే దీక్షలు ప్రారంభమయ్యాయి. గుంతకల్లులోని డీజిల్ షెడ్, రైల్వే ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన రిలే దీక్షల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. మంగళవారం డీఆర్‌ఎం కార్యాలయం వద్ద అన్ని శాఖల ఆధ్వర్యంలో జరిగే రిలేదీక్షల్లో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీజిల్ షెడ్ బ్రాంచ్ కార్యదర్శి అప్పారావు, చైర్మన్ శివప్రసాద్, నాయకులు జాకీర్‌బాషా, వెంకటేశ్వరరావు, గోసి, మునికుమార్, నాగరాజు, సూర్యనారయణ, మల్లయ్య, తోటఖలీల్ పాల్గొన్నారు.

గుత్తి: సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని రైల్వే ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం గుత్తి ఆర్‌ఎస్‌లోని రైల్వే బుకింగ్ కార్యాలయంలో సమీపంలో దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు సుభాస్‌బాబు, కుళ్లాయప్ప, రాజశేఖర్‌రెడ్డి, నారయణ, కృష్ణమోహన్, సుధాకర్ పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు

పెద్దపప్పూరు: మండలంలోని కొట్టాలపల్లి వద్ద సాగు చేసిన పప్పుశనగ పంటలో సోమవారం అధికారులు పంటకోత ప్రయోగం చేశారు. రైతు జగదీశ్వర్ నాయుడు పంటలో నిర్దేశిత కొలతల్లో పంటను తొలగించి దిగుబడి లెక్కించారు. 450 గ్రాముల దిగుబడి వచ్చిందని ఏఓ ఆంజనేయులు తెలిపారు.

గుత్తి రూరల్: మండలంలోని కరిడికొండ గ్రామంలో సోమవారం జాతీయ ఆహార భద్రత మిషన్ ఆధ్వర్యంలో కంది పంటపై క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఏఓ ముస్తాక్ అహ్మద్ గ్రామ శివారులోని కంది పంటను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా కంది పంటలో ఆశించిన దిగుబడి రాలేదన్నారు. 2024 ఖరీఫ్ సీజన్‌లో రైతులకు మేలు రకం విత్తనాలను అందిస్తామని తెలిపారు. ఈ ఏడాది వర్షాధారం కింద జొన్న, కొర్ర, సజ్జలు పండించాలని సూచించారు.

అభివృద్ధికే పట్టం కట్టండి

తాడిపత్రి: గత నాయకుల పాలనలో తాడిపత్రి నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే కేతిరెడ్డి పాలనలో తాడిపత్రి అభివృద్ధిలో పరుగులు పెడుతోందని యువనాయకుడు కేతిరెడ్డి సాయి ప్రతాప్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 34వ వార్డులో సోమవారం ఆయన పర్యటించారు. ముఖ్యమంత్రి జగనన్న పథకాల ద్వారా చేకూర్చిన లబ్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించారు. మరో సారి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకుడు పూల బాలరాజు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: మండల పరిధిలోని చిన్నపోలమడ గ్రామంలో నాయకుడు కేతిరెడ్డి సాయి ప్రతాప్‌రెడ్డి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. పథకాలన్నీ అందుతున్నాయని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఫించన్ కోసం అష్టకష్టాలు పడ్డామని.. వైఎస్సార్‌సీపీ వచ్చాక ఇంటి వద్దకే వచ్చి ఫించన్ అందజేస్తున్నారని వృద్ధులు తెలిపారు. మా కష్టాలు తీర్చిన దేవుడు జగనన్న అని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగేంద్రమ్మ, జెడ్పీటీసీ రమణమ్మ, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ఓబులరెడ్డి, సీనియర్ నాయకుడు రామేశ్వరరెడ్డి, మండల కన్వీనర్ పల్లె నాగేశ్వరరెడ్డి, వక్ఫ్‌బోర్డ్ సెక్రటరీ బాబా పెద్దిరెడ్డి, రమణారెడ్డి, భోగేశ్వరరెడ్డి, సురేష్‌కుమార్, చంద్రలోకారెడ్డి, విజయ్, నరేంద్ర, బాబు, కొండన్న, రామ్మోహన్ రెడ్డి, వీరనాగప్ప పాల్గొన్నారు.



పింఛన్‌దారులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి

రక్తదానం చేయడం అభినందనీయం

యాడికి: మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ సభ్యులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం. రక్తదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడవచ్చని ఎస్‌ఐ గురుప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో చెన్నకేశవ స్వామి దేవాలయం వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. పలు గ్రామాల ప్రజలు, అంగన్వాడీ కేంద్రాల టీచర్లు మొత్తం 85 మంది రక్తదానం చేశారు. రక్తదాన శిబిరంలో సేకరించిన రక్తాన్ని తాడిపత్రికి చెందిన సేవాబ్లడ్ సెంటర్ వారికి అందజేసినట్లు మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణరావు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు బాలకృష్ణ, చంద్రోశేఖర్ రెడ్డి, వరల్డ్ బ్లడ్ డోనర్ డాక్టర్ సంపత్ కుమార్, దుర్గం రక్తదాతల ఫౌండర్ లయన్ కంబాల తిమ్మారెడ్డి, పులివెందుల మహేష్, హరి తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరానికి హాజరైన ఎస్‌ఐ గురుప్రసాద్ రెడ్డి

పేకాట స్థావరంపై దాడి

యల్లనూరు: మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్‌ఐ ధరణీబాబు, కానిస్టేబుల్ రవీంద్రారెడ్డి సోమవారం దాడులు చేశారు. ఈ దాడిలో ముగ్గురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3,600 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి

యల్లనూరు: తిరుమలాపురం గ్రామంలోని దళిత కాలనీలో సోమవారం కులశేఖర్‌పై శివాంజనేయులు అనే వ్యక్తి కట్టెతో దాడి చేశాడు. ఈ ఘటనలో కులశేఖర్ ఎడమ చేయి విరిగింది. కుటుంబ సభ్యులు అతడ్ని చికిత్సల నిమిత్తం తాడిపత్రిలోకి ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ధరణీబాబు గొడవపై ఆరా తీశారు. కాలనీలోని సీసీ రోడ్డులో రావొద్దని కులశేఖర్‌కు శివాంజనేయులు సూచించాడన్నారు. ఈ విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగినట్లు పేర్కొన్నారు. దాడికి పాల్పడిన శివాంజనేయులును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పరామర్శ..

విషయం తెలుసుకున్న తిరుమలాపురం సర్పంచ్ అజ్జుగుట్టు రామాంజుల రెడ్డి ఆస్పత్రికి వెళ్లి కులశేఖర్‌ను పరామర్శించారు. నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. వైద్యానికి అయ్యే ఖర్చు తానే భరిస్తానని తెలిపారు.

గుత్తి కోట క్యాలెండర్ ఆవిష్కరణ

గుత్తి: గుత్తి ఫోర్టు రైల్వే స్టేషన్‌లో సోమవారం గుత్తి కోట క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంఈ ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ.. గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా చేస్తే మరింతగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఈ విజయానంద్, రైల్వే ఉద్యోగి రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్ష, గౌరవాధ్యక్షుడు చౌదరి విజయ భాస్కర్, వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు అంజన్ ప్రసాద్, వైఎస్సార్ టీఎఫ్ జిల్లా నాయకులు శ్రీధర్ గౌడ్, గుత్తి కోట యువజన సంఘం అధ్యక్షుడు చిరంజీవి, రిటైర్డ్ వార్డెన్ మల్లికార్జున, ఆటో యూనియన్ నాయకులు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సంక్షిప్త సమాచారం

వికసిత్ భారత్ సంకల్పయాత్ర

పామిడి: మండలంలోని రామరాజుపల్లి గ్రామంలో సోమవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 పథకాలపై అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, డాక్టర్ ఉదయ్‌కిరణ్, వెలుగు ఏపీఎం సాలే అరుణ, సర్పంచ్ డీసీ ముత్యాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వాహనాలు వేగంగా నడిపితే చర్యలు

బుక్కరాయసముద్రం: వాహనాలను వేగంగా నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని అనంతపురం-తాడిపత్రి రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన రికార్డులు కలిగి ఉండాలన్నారు.

బస్సుయాత్ర జయప్రదం చేయండి

పామిడి: గుంతకల్లులో మంగళవారం జరగనున్న సామాజిక సాధికార బస్సుయాత్రను జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కోరారు. పట్టణ, రూరల్ కన్వీనర్లు జోజుడే కుమార్, కే.నారాయణ రెడ్డి, సచివాలయ పట్టణ, రూరల్ కన్వీనర్లు బి.ఆసిఫ్, ఎం.కుమార్‌రెడ్డి, ఎంపీపీ భోగతి మురళీమోహన్‌రెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మహిళలు తరలిరావాలన్నారు.

సంచారజాతులకు రిజర్వేషన్ కల్పించాలి

గుంతకల్లుటౌన్: అన్ని రంగాల్లో వెనుకబడిన సంచార జాతులకు రాష్ట్ర పరిధిలో విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఎంబీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జోగి వెంకటేష్, ఏపీ సంచారజాతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసులు కోరారు. సోమవారం మెయిన్ రోడ్డు మున్సిపల్ ఆఫీసు ఎదుట సంచారజాతుల సంఘం ఆధ్వర్యంలో రిజర్వేషన్ సాధనకు బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంచారజాతులకు రాజ్యాంగ బద్ధంగా కులాలు, జాతులుగా గుర్తించి 3వ షెడ్యూల్ ప్రకారం ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం తరహాలోనే సామాజిక భద్రత చట్టాన్ని వర్తింపచేయాలన్నారు. సంచారజాతుల కళాకారులకు పింఛన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చిన్నం పెద్ద వెంకటేశులు, బాలసంతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కుళ్లాయప్ప, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఇందిరాదేవి, నాయకులు మారెన్న, దౌలప్ప, రాయుడు, ఉలిగప్ప, విజయ్, మద్దిలేటి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ తరలింపు

గుత్తి రూరల్: ఎంగిలిబండ గ్రామంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం వేరే ప్రదేశంలోకి మార్చారు. బీసీ కాలనీకి వెళ్లే దారిలో ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుకు అడ్డంగా ఉండటంతో వేరే చోటుకు మార్చాలని గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డికి గ్రామస్తులు విన్నవించారు. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు సోమవారం రోడ్డుకు అడ్డంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇతర ప్రదేశానికి తరలించి అక్కడ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాముయాదవ్, హరి, గంగాధర్ పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు

పుట్లూరు: ఈవ్‌టీజింగ్ చేస్తే కటకటాలపాలు కావల్సిందేనని ఎస్‌ఐ దిలీప్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని శనగలగూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలకు వచ్చే సమయంలో, బస్సులో ప్రయాణించే సమయంలో ఎవరైనా అసభ్యకరంగా ప్రవరిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధానోపాధ్యాయులు చౌడేశ్వరప్రసాద్, మహిళా పోలీస్ రామతులసి పాల్గొన్నారు.

దిశ యాప్‌పై అవగాహన

నార్పల: దిశ యాప్‌తో మహిళలకు రక్షణ లభిస్తుందని ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో దిశ యాప్, ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. ఎవరైనా ఆకతాయిలు మహిళలు, విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



అనంతయ్య మృతదేహం

గుత్తి: పట్టణంలోని కురుబ వీధికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు షేమియాల అనంతయ్య (70) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలు.. గాయత్రి వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు షేమియాల అనంతయ్య ఇంటి నుంచి కూరగాయలు తీసుకురావడానికి నడుచుకుంటూ బజారుకు బయలుదేరాడు. అయితే మార్గంమధ్యలో ఒక్కసారిగా కుప్పకూలి కింద పడ్డాడు. స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అనంతయ్య మృతి పట్ల గుంతకల్లు ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్ బీ, పట్టణ కన్వీనర్ పీరా, 8వ వార్డు సచివాలయ ఇన్‌చార్జ్‌లు హమాలి రామాంజి, అరటి పండ్ల చంద్ర తదితరులు సంతాపం తెలిపారు.

యాడికి అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐగా నాగార్జున రెడ్డి



యాడికి: అనంతపురం ఎస్‌బీ కార్యాలయంలో సీఐగా విధులు నిర్వహిస్తున్న నాగార్జున రెడ్డిని యాడికి అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌కు సీఐగా బదిలీ చేశారు. సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన సీఐ మాట్లాడుతూ.. మండలంలో పేకాట, మట్కా, జూదం వంటి వాటిని ఉపేక్షించేది లేదన్నారు. సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని తెలిపారు. అంతకు ముందు అప్‌గ్రేడ్ సీఐగా బాధ్యతలు చేపట్టిన నాగార్జున రెడ్డికి ఎస్‌ఐ గురుప్రసాద్ రెడ్డి, పోలీసులు ఘన స్వాగతం పలికారు.

విధుల్లో చేరనున్న అంగన్‌వాడీలు



తాడిపత్రి ఐసీడీఎస్ కార్యాలయంలో రిపోర్టు చేసుకుంటున్న అంగన్‌వాడీలు

యాడికి: మండల కేంద్రంలోని నంబర్-4 అంగన్‌వాడీ టీచర్ మహాలక్ష్మి, ఆయా సునీత, నిట్టూరు-1 మినీ అంగన్వాడీ టీచర్ సావిత్రి, ఆయా రాజేశ్వరి తాడిపత్రి ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం రిపోర్టు చేసుకున్నారు. ఈ మేరకు యాడికి, నిట్టూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయకుమారి సమక్షంలో విధుల్లో చేరారు. ఇటీవల అంగన్‌వాడీలు సమ్మె చేపట్టడంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇబ్బందులు పడ్డారు. పౌష్టికాహార పంపిణీకి సమస్యలు తలెత్తడంతో విధులకు హాజరు కావాల్సిందేనని ప్రభుత్వం రెండు రోజుల క్రితం ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా సమ్మె విరమించిన అంగన్‌వాడీలు విధుల్లో చేరారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

తాడిపత్రి: స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జీఎల్ శంకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు 9959225856 నంబర్‌కు కాల్ చేసి సూచనలు, సలహాలు చెప్పాలన్నారు.

అయోధ్య అక్షింతలతో ర్యాలీ

పామిడి: పట్టణంలో సోమవారం అయోధ్య అక్షింతలతో రామ భక్తులు ర్యాలీ చేపట్టారు. శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ పామిడి ఖండ ఆధ్వర్యంలో పురవీధుల్లో భజన చేశారు. మహిళలు, చిన్నారులు, పెద్దలు కాషాయ జెండాలు ధరించి జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేపట్టారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి అయోధ్య అక్షింతలు పంపిణీ చేశారు.

రౌడీషీటర్ల బైండోవర్

పుట్లూరు: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 11 మంది రౌడీషీటర్లను సోమవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో వీరికి కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. వివాదాలకు దూరంగా ఉండాలని సూచించినట్లు తెలిపారు. రౌడీషీటర్లపై ఎల్లప్పుడూ నిఘా ఉంటుందని ఎవరైనా చట్ట వ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.